క్లుప్తంగా

నేటి నుంచి రైల్వేగేటు మూసివేత

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు - దెందులూరు రైల్వే స్టేషన్ మధ్య లెవెల్ క్రాసింగ్ నంబర్ 351 (489 కిలోమీటర్) వద్ద అత్యవసర మరమ్మతుల నిమిత్తం ఈ నెల 1వ తేదీ నుంచి 17 వరకు రైల్వేగేటు మూసివేయనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ ఎస్ లోకేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు జీఎన్‌టీ రోడ్డు నుంచి నిమ్మకాయల మార్కెట్ యార్డుకు వెళ్లే రహదారిలో ప్రయాణించే వాహనచోదకులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు.

9న ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సదస్సు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లాలో కలిదిండి బస్ స్టేషన్లో ఉన్న 2 ఖాళీ స్థలాలను 15 సంవత్సరాలకు లీజుకి ఇచ్చే నిమిత్తం ఇటీవల టెండర్లు పిలిచామని ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి షేక్ షబ్నం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టెండర్ ప్రకటనపై ఈ నెల 9న బుధవారం సాయంత్రం 4 గంటలకు ఏలూరులోని తమ కార్యాలయంలో ఔత్సాహిక వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సదస్సుకు హాజరై ఆర్టీసీ స్థలాల్లో వ్యాపారాలు చేసుకుంటూ అభివృద్ధి చెందాలని సూచించారు.

సమస్యలపై నాలుగు వినతులు

దెందులూరు: రేషన్ కార్డు, భూ సమస్యలకు సంబంధించి నాలుగు వినతులు అందాయని ఏలూరు రూరల్ మండలం తహసీల్దార్ జి.విజయ్ కుమార్ రాజు తెలిపారు. సోమవారం ఏలూరు రూరల్ మండలం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో ప్రజల నుంచి ఆయన వినుతులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత ఉద్యోగులకు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో అన్ని శాఖల మండల అధికారులు, డిప్యూటీ తహసీల్దార్లు నాగమణి, ప్రియదర్శిని, ఆర్ఐ, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు కండ్రిక గూడెం సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం సోమవారం నిర్వహించారు. నేతలు కె.సత్యం, కె.రమేష్, కె.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్ పీటర్ మృతి తీరని లోటు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏపీటీఎఫ్ ఏలూరు జిల్లా కౌన్సిలర్ పీజేపీపీ ఎయిడెడ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పూని శ్యామ్ పీటర్ అకాల మరణం ఉపాధ్యాయ ఉద్యమానికి తీరని లోటని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రామారావు, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కురుమ ఆనంద కుమార్, అబ్బదాసరి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన స్థానిక ఆంధ్రా హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారని పేర్కొన్నారు.

వివాదాల్లో మాకా ఉర్దూ పాఠశాల

- అర్హత లేకుండానే ప్రధానోపాధ్యాయురాలిగా నియామకం
- కోర్టుకు వెళ్లిన అర్హత ఉన్న టీచర్
- ఇంగ్లిష్ మీడియంలోకి మారాలంటూ విద్యార్థులకు బెదిరింపులు
- ఆందోళన బాట పట్టనున్న తల్లిదండ్రులు



నగరంలోని మాకా ఉర్దూ పాఠశాల

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు నగరంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ (మాకా) నగరపాలక సంస్థ ఉర్దూ ఉన్నత పాఠశాల మరో వివాదం తలెత్తింది. ఇటీవల విద్యాశాఖలో జరిగిన పదోన్నతులు, బదిలీల్లో ఈ పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు ఉర్దూ మీడియంలో బోధించలేని పరిస్థితిలో విద్యార్థులను మీడియం మారాలని బలవంతం చేస్తుడడంతో వివాదం నెలకొంది. ప్రస్తుతం మరో వివాదంలోకి ఈ పాఠశాల వెళ్లినట్టు తెలుస్తోంది. ఈ వివాదాల నేపథ్యంలో తమ బిడ్డల భవిష్యత్ ఏమౌతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. విద్యాశాఖ అధికారులు చేసిన తప్పిదాన్ని కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నిస్తుండడం కొత్త వివాదాలకు కేంద్రబిందువుగా ఈ పాఠశాల మారింది.

అర్హత లేకుండానే నియామకం

నగరంలోని కస్తూరిబా బాలికోన్నత పాఠశాల నుంచి పదోన్నతి పొందిన ఉపాధ్యాయురాలికి అసలు మాకా ఉర్దూ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలిగా రావడానికి అర్హత లేదంటున్నారు. నిబంధనల ప్రకారం ఉర్దూ పాఠశాలకు ప్రధానోపాధ్యాయినిగా రావాలంటే ఆ ఉపాధ్యాయురాలు 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ చదివే సమయంలో ఏదో ఒక దానిలో ఉర్దూను కనీసం ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి. అయితే ప్రస్తుతం ఆ పాఠశాలకు వచ్చిన ప్రధానోపాధ్యాయురాలు ఉర్దూ సబ్జెక్టునే చదవలేదని తెలిసింది. ఆమెకు అర్హత లేకపోయినా విద్యాశాఖ అధికారులు దొడ్డిదారిన ఈ స్థానంలో నియమించారని అంటున్నారు.

కోర్టుకు వెళ్లిన టీచర్

తనకు అర్హత ఉన్నా కాదని అర్హతలేని ఉపాధ్యాయురాలిని ప్రధానోపాధ్యాయురాలిగా నియమించడాన్ని సవాలు చేస్తూ ఇదే పాఠశాలలో గత ఏడాదిగా ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలిగా పని చేస్తున్న టీచర్ హైకోర్టుకు వెళ్లారు. ప్రస్తుతం ఆ వివాదం విద్యార్థుల తల్లిదండ్రుల్లో గుబులు రేపుతోంది. వివాదాల నేపథ్యంలో తమ బిడ్డల విద్య ప్రశ్నార్థకంగా మారనుందని వాపోతున్నారు. ఒక ప్రజా ప్రతినిధి సిఫార్సుల మేరకే అర్హత లేని ఉపాధ్యాయురాలిని పదోన్నతిపై ఒక్కడ నియమించారని, ఆయన తాను సిఫార్సు చేసిన ఉపాధ్యాయురాలే ఇక్కడ ప్రధానోపాధ్యాయురాలిగా ఉండాలని మంకు పట్టు పట్టినట్టు తెలిసింది. అలాగే విద్యాశాఖ అధకారులు సైతం ఈ విషయంలో కొంత మొత్తాన్ని ఆమె వద్ద తీసుకోవడంతో వారు కూడా ఈమెనే కొనసగించడానికి తగిన విధంగా పావులు కదుపుతున్నారని చెబుతున్నారు.

ఇంగ్లిష్ మీడియం రుద్దడానికి బలవంతపు చర్యలు

చిన్ననాటి నుంచి ఉర్దూ మీడియంలో చదువుతున్న విద్యార్థులకు ఉర్దూలో పాఠ్యాంశాలు బోధించలేని ఉపాధ్యాయులను ఈ పాఠశాలకు బదిలీ చేయడాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వ్యతిరేకించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ పాఠశాలకు విచారణకు వెళ్లిన ఒక విద్యాశాఖ అధికారి విద్యార్థులందరినీ ఒక తరగతి గదిలోకి తీసుకువెళ్లి తలుపులు వేసి ఇంగ్లిష్ మీడియంలోనే చదువుతామని లేఖలు రాసి ఇవ్వాలని, లేనిపక్షంలో వారిపై కేసులు వేస్తామని బెదిరించారని విద్యార్థులు తమ తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఒక టీచర్ తన భర్త పోలీస్ అని, మరో టీచర్ తన భర్త లాయర్ అని చెబుతూ విద్యార్థులను కేసుల్లో ఇరికిస్తామని బెదిరిస్తున్నారని చెబుతున్నారు. ఇలా.. నానా రకాలుగా ఒత్తిడిల నేపథ్యంలో ఏం చేయాలో తెలియడంలేదని, నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళనకు సన్నద్ధం

జిల్లాలోనే దాదాపు 95 సంవత్సరాల నుంచి ఉన్న ఉర్దూ పాఠశాలను రాజకీయ, ఉద్యోగుల స్వార్థ ప్రయోజనాల కోసం మార్చేయాలని చూస్తే సహించబోమని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ముస్లిం పెద్దలు హెచ్చరిస్తున్నారు. తమ మాతృభాషలో చదువుకునే హక్కులను కాలరాయాలని కుట్ర పన్నుతున్నారని ఆందోళన చెందుతున్నారు. తమకు అన్యాయం చేయొద్దని విజ్ఞప్తి చేయడానికి పాఠశాలకు వెళితే కొందరిపై అక్కడి టీచర్ల చేత తప్పుడు కేసులు పెట్టించడం సరికాదంటున్నారు. తప్పుడు కేసులకు భయపడేది లేదని, అవసరమైతే తమ పోరాటాన్ని విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళతామని స్పష్టం చేస్తున్నారు.

బెదిరించడం తగదు



ఒక అధికారి విచారణ పేరుతో పాఠశాలకు వచ్చి ఇంగ్లిష్ మీడియంలోకి మారాలని విద్యార్థులను బెదిరించడం తగదు. ఆ అధికారి నిష్పక్షపాతంగా విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించాలే తప్ప పిల్లలను ఇబ్బంది పెట్టడం దారుణం. సంతకం పెట్టకపోతే టీచర్లపై దాడులు చేస్తున్నారని కేసుల్లో ఇరికిస్తామని భయపెట్టడం ఎంతవరకూ న్యాయం. – షేక్ అజ్మల్, విద్యార్థి తండ్రి

పిల్లల భవిష్యత్‌పై ప్రభావం



ఉర్దూ మీడియంలో చదువుతున్న మా పిల్లలను ఒక్కసారిగా మీడియం మారిపోవాలంటే ఎలా. ఇప్పటికిప్పుడు మారిపోయి దానిని అర్థం చేసుకుని 10వ తరగతి పరీక్షలకు వెళ్లడం సాధ్యమేనా ఆలోచించాలి. మీడియం మార్పు కారణంగా మా పిల్లలు పరీక్ష తప్పితే ఎవరు బాధ్యత వహిస్తారు. ఉపాధ్యాయుల ప్రయోజనాల కోసం పిల్లల భవిష్యత్‌పై దెబ్బకొడతారా. – ఎండీ ఖాన్, విద్యార్థి తండ్రి

విద్యార్థులకు బూట్ల పంపిణీ



బూట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం మానూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బూట్లు పంపిణీ చేశామని ప్రధానోపాధ్యాయులు తేరా ప్రసాద్ తెలిపారు. సమగ్ర శిక్ష పాఠశాల విద్యపై సమావేశం నిర్వహించామన్నారు. తల్లిదండ్రులకు ఈనెల 10న జరిగే కార్యక్రమానికి ఆహ్వాన పత్రికలు తల్లిదండ్రులకు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.అరుణ, ఎస్ఎంసీ చైర్మన్ పేరం రాము, గ్రామస్తులు ఉన్నారు.

జెడ్పీలో ఇద్దరు ఉద్యోగులకు పదోన్నతులు



పదోన్నతి పత్రాలను అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

ఏలూరు(మెట్రో): జిల్లా పరిషత్‌లో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్లు (ఏఓ) జి.పద్మ, జి.కామేశ్వరరావులు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పదోన్నతులు పొందారు. జెడ్పీ చైర్‌పర్సన్ జి.పద్మశ్రీ వారికి సోమవారం పదోన్నతులు ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ ఎం శ్రీహరి, పదోన్నతులు పొందిన ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

వేతనాల కోసం ధర్నా



ఎస్‌ఆర్-1 వద్ద ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు

ఏలూరు(ఆర్‌ఆర్‌పేట): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో ప్రభుత్వ శాఖలలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం ఏలూరు ఆర్‌ఆర్‌పేట ఎస్‌ఆర్-1 వద్ద ఏఐటీయూసీ అనుబంధ ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర పిలుపులో భాగంగా నిర్వహించిన ఈ ధర్నాలో ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడారు. రెగ్యులర్ చేసేవరకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మిక హక్కులను హరిస్తూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా జూలై 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెలో ఉద్యోగ, సిబ్బంది పాల్గొనాలని కోరారు. యూనియన్ నాయకులు డి.వెంకటేశ్వరరావు, నారా శ్రీను, వెంకట రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విజయవంతానికి బైక్ ర్యాలీ



మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్షాల నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కార్మిక హక్కుల పరిరక్షణకు జూలై 9వ తేదీన నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ ఏలూరు నగరంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ స్థానిక జూట్ మిల్ వద్ద ప్రారంభమై గడియార స్తంభం, మార్కెట్, పాత బస్టాండ్ సెంటర్, కర్రల వంతెన సెంటర్, పవర్ పేట రైల్వే స్టేషన్, ఆర్ఆర్ పేట పార్క్, ఫైర్ స్టేషన్ మీదుగా బస్టాండ్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, ఇఫ్టూ జిల్లా కార్యదర్శి బి.వెంకట్రావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆర్ శ్రీనివాస్ మాట్లాడుతూ 9వ తేదీ జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు సమ్మె ద్వారా హెచ్చరిక జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అంబానీ, ఆదాని వంటి కార్పొరేట్ల కోసమే లేబర్ కోడ్లను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు ఎం కృష్ణ చైతన్య, ఎర్ర శ్రీనివాసరావు, బండి వెంకటేశ్వరరావు, బి.సోమయ్య, పి.కన్నబాబు, కె.కృష్ణమాచార్యులు, వీవీఎన్ ప్రసాద్, జి.రాంబాబు, కె.అప్పారావు, కె.విజయలక్ష్మి, బి.శ్రీనివాస్, బి.వినోద్, పి.భాస్కర్, పి.రవికుమార్ ఐలూ రాష్ట్ర నాయకుడు ఎస్ఎస్ కట్టా తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	36	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	40	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	46	బీన్లచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	48	చామదుంపలు	36
బెండకాయలు	36	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	44	కంద	--
కాకర కాయలు	40-48	బీట్‌రూట్	38
బీరకాయలు	34	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	44	ఫ్రెంచ్‌బీన్స్	96
క్యాబేజీ	26	అల్లం	60
క్యారెట్	38	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	40	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	28	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

10న 'తల్లికి వందనం' జమ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): 2025 - 26 విద్యా సంవత్సరంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ఎస్సీ విద్యార్థులకు తల్లికి వందనం పథకానికి సంబంధించి ఈ నెల 10న నగదు విద్యార్థుల బ్యాంకు అకౌంట్‌కు జమచేయనున్నట్టు జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారిత అధికారి వై.విశ్వమోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు విద్యార్థుల పేరున ఉన్న బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ నంబర్‌కు లింక్ కానివారు అందరూ బ్యాంకుకు వెళ్లి లింక్ చేయించుకోవాలనొ పేర్కొన్నారు. అకౌంట్ లేని విద్యార్థులకు అమౌంట్ జమ కాబడదని, బ్యాంకు అకౌంట్ లేని వారు పోస్ట్ ఆఫీస్‌లో అకౌంట్ ఓపెన్ చేయాలని సూచించారు.

ఫాదర్ పాస్కృలి పునీతులు



హోలీల్యాండ్‌లో ప్రత్యేక దివ్యబలిపూజ అర్పిస్తున్న బిషప్ జయరావు, గురువులు

పెదవేగి : ఇటలీ నుంచి భారతదేశానికి వచ్చి పేదలకు మరువలేని సేవలందించిన ఫాదర్ సిల్వియో పాస్కృలి పేరు పునీతుల పుటల్లో లిఖించబడిందని ఏలూరు పీఠాధిపతి మోస్ట్ రెవరెండ్ బిషప్ పొలిమేర జయరావు పేర్కొన్నారు. సోమవారం పెదవేగి మండలం పినకడిమి పవిత్ర భూమిలో సీఎస్‌ఏ సంస్థ వ్యవస్థాపకులు పాస్కృలి 101వ వర్ధంతిని ఆ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సీఎస్‌ఏ అసిస్టెంట్ జనరల్ సిస్టర్ అల్ఫోన్స ఆధ్వర్యంలో స్థానిక హోలీల్యాండ్ సూపీరియర్ సిస్టర్ ఇన్యాసమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి ఫాదర్‌లు, సిస్టర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జయరావు ప్రత్యేక దివ్యబలిపూజ అర్పించారు. అనంతరం భక్తులకు ప్రేమవిందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏలూరు పీఠం వికార్ జనరల్ ఫాదర్ బాల, సెయింట్ జోసెఫ్ దంత కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి మోజెస్, ఇతర ఫాదర్‌లు, సిస్టర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



పీర్లను ఊరేగిస్తున్న ముజావర్లు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మొహర్రం సందర్భంగా సోమవారం ఏలూరు నగరంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో పీర్ల నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఏలూరు పరిసర ప్రాంతాల్లోని 15 ఆస్థానాల్లో మొహర్రం వేడుకల్లో భాగంగా ప్రతి నిత్యం ప్రత్యేక ప్రార్థనలు, దరూదె సలాం, ఫాతెహా ఖానీ నిర్వహించారు. సోమవారం సాయంత్రం స్థానిక కండీ సెంటర్‌లోని మౌలా అలి ముష్కిల్ కుష ఆస్థాన (గొలుసుల పంజా) పంజా వద్దకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిలపిన పీర్లను ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడి నుంచి మేళతాళాలతో యువకుల నృత్యాలతో పీర్లను స్థానిక గడియార స్తంభం, మెయిన్ బజారు, బిర్లా భవన్ సెంటర్, పాత బస్టాండు ప్రాంతాల మీదుగా ఊరేగించి స్థానిక పాత బస్టాండు వద్ద ఉన్న కర్బలా మైదానానికి వచ్చారు. అక్కడ గన్‌బజారులోని జల్‌జలా సాహెబ్ ఆస్థానంతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న వివిధ పంజాల్లో ఏర్పాటు చేసిన పీర్లను నిమజ్జనం చేశారు.

అమ్మవారికి ఆషాఢ సారె సమర్పణ



సారెతో అమ్మవారికి పూజ చేస్తున్న అర్చకుడు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక పాతబస్టాండు వద్ద ఉన్న శ్రీ పాండురంగ స్వామి దేవస్థానంలో ఈ నెల 6 నుంచి ప్రారంభమైన తొలి ఏకాదశి, గురు పౌర్ణమి మహోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ బాలా త్రిపుర సుందరి అమ్మవారికి ఆసాఢ సారెను భక్తి శ్రద్ధలతో భక్తులు సమర్పించారు. ఉదయం ఏకరుద్రాభిషేకం, రుద్రహోమం నిర్వహించారు. సారె సమర్పణ అనంతరం సౌందర్యలహరి, మినీ సుందర కాండ పారాయణ చేశారు. సాయంత్రం శ్రీ లలితా సహస్రనామ, సిద్ధ మంగళ స్తోత్ర పారాయణ నిర్వహించారు. అర్చకులు దండిభొట్ల కనక సుందర శర్మ విశేష పూజలు చేయగా, ఆలయ కార్య నిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	36
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	34
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	45
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	19
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో 22సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	22
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	29
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	32
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

ఓర్వలేకే టీడీపీ ఆరోపణలు

- కొండలరావుపాలెం సమావేశం విజయవంతంతో ఉలిక్కిపడ్డ టీడీపీ శ్రేణులు
- అసత్య ఆరోపణలపై వైఎస్సార్‌సీపీ నేతల ఆగ్రహం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దెందులూరు: మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరిపై టీడీపీ నాయకులు పొంతన లేకుండా మాట్లాడుతున్నారని వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్ అన్నారు. సోమవారం దెందులూరు మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కొండలరావుపాలెంలో జరిగిన బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమానికి అబ్బయ్యచౌదరి ఇచ్చిన పిలుపుతో వేలాది మంది తరలి రావడంతో ఒక్కసారిగా టీడీపీ నాయకులు ఉలిక్కిపడ్డారన్నారు. గతంలోనే అబ్బయ్య చౌదరి తాను ఎవరికీ బాకీ లేనని సవాల్ విసిరారని ఇప్పటి వరకు టీడీపీ శ్రేణులు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. కై కలూరులో చెరువులు ఎక్కడా కొట్టలేదని ఏలూరు రూరల్ మండలంలో వందలాది ఎకరాలు కక్షపూరిత వేధింపులతో నాశనం చేశారన్నారు. ఈ కక్షపూరిత చర్యలను ప్రజలు గమనిస్తున్నారన్నారు.

అవి సత్య ఆరోపణలు

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్ మాట్లాడుతూ దురుద్దేశంతో టీడీపీ శ్రేణులు మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరిపై ఆరోపణలు చేయడం విచారకరమన్నారు. అబ్బయ్యచౌదరి పిలుపు మేరకు వేలాది మంది సమావేశానికి తరలి రావడంతో అతనిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నాని మాట్లాడుతూ అబ్బయ్య చౌదరి పిలుపుతో సమావేశం విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ నాయకులు కూటమి ప్రభుత్వ హయాంలో దాడులు, దౌర్జన్యాల కేసులు లేవని చెప్పటం దుర్మార్గమన్నారు. సోమవారం మండల వైస్ ఎంపీపీ వేమూరు జితేంద్ర పెట్రోల్ బంకు, కారు, జీపు ధ్వంసం చేశారన్నారు. ఇది దుర్మార్గ చర్య కాదా అని ప్రశ్నించారు.